కథ

# పెళ్ళి కుదిరింది!

- కోరుకొండ సూర్యకుమారి

రాంబాబుకి రాధిక నచ్చింది.

ఎందుకంటే...

పెళ్ళిచూపుల్లో రాధిక తలదించుకొనికూర్చుంది. పొందికగా కూర్చుంది. ఒద్దికగా కూర్చుంది. తల్లి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చక్కగా చెప్పింది. చెప్పడంలో ఎంతో నమ్రత కన్పించింది. గొంతు వినసొంపుగా విన్పించింది. అణకువ గల అమ్మాయనిపించింది. పైగా అందంగానూ వుంది.

అందుకే తల్లివెంట బయటకు వెళ్ళి రాధిక నచ్చిందని చెప్పాడు. అంతలో తండ్రి కూడా వచ్చాడు. రాధిక అన్నివిధాలా బాగుందని ముగ్గురికి ముగ్గురూ చెప్పుకున్నారు.

ఆ వెనుకే వచ్చిన మధ్యవర్తికి వాళ్ళ సంభాషణ విన్పించింది. అతని ముఖం వికసించింది. మిగతా విషయాలు కదిపేద్దామని, ఆడపెళ్ళి వాళ్ళని కుదిపేద్దామని అన్నాడు. అన్న వెంటనే నాలుగడుగులు ముందుకి వేశాడు. రాంబాబు తండ్రి మూడడుగులు వేశాడు. రాంబాబు తల్లి ఒక అడుగు వేసి ఆగిపోయింది.

రాంబాబు ఒక్కడుగూ వేయలేదు. ఎందుకంటే రాంబాబుని ఓ ఆలోచన తొలుస్తోంది!

ఒక అడుగు వేసిన రాంబాబు తల్లికీ ఒక ఆలోచన వచ్చింది. అందుకే రెండో అడుగు వెయ్యకుండా ఆగిపోయింది. మధ్యవర్తి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోతున్న భర్తచొక్కాని పట్టుకుంది. లోపలకు వెళ్ళబోయి వెనక్కి తిరిగిచూస్తే ఎవరూ లేకపోవడంతో వెనక్కి వచ్చిన మధ్యవర్తి చెవి పట్టుకుంది.

విషయం రుచించని మధ్యవర్తి ముఖం అదోలా పెట్టాడు. ఆలస్యం అమృతం విషం కదా అన్నాడు. అవును కదా అన్నట్టు చూసాడు రాంబాబు తండ్రి. నిదానమే ప్రధానం కదా అని నిదానంగా రిటార్టు వదిలింది రాంబాబు తల్లి. నిజమే కదా అన్నట్టు చూసాడు రాంబాబు తండ్రి.

రాంబాబుకి విషయం తెలియలేదు.

అంతలోనే ముగ్గురూ లోపలకు వెళ్లారు. క్షణం ఆగి రాంబాబూ కదిలాడు. ఆతృతగా ఎదురుచూస్తున్న ఆడపెళ్ళి వాళ్ళతో 'రెండ్రోజుల్లో ఏ విషయమూ కబురు చేస్తాం' అని డిక్లేర్ చేసింది రాంబాబు తల్లి.

రాంబాబు, తల్లి, తండ్రి ఆటో ఎక్కి వెళ్ళిపోయారు. మధ్యవర్తి మాత్రం పెళ్ళికూతురు వాళ్ళింట్లోనే ఉండిపోయాడు. మధ్యవర్తి నోటివెంట రాబోయే మాటల కోసం ఆసక్తిగా ఎదురుచూడసాగారు ఆ ఇంట్లో అందరూ. మధ్యవర్తి చిద్విలాసంగా నవ్వాడు.

'అమ్మాయి నచ్చినట్టే. మిగతా విషయాలు కూడా ఇప్పుడే మాట్లాడుకోవాల్సింది. కానీ ఆవిడగారు అడ్డుపుల్ల వేసింది. ఏమైనా ఈ సంబంధం ఖాయం అవ్వడం మాత్రం ఖాయం!'

మళ్ళీ మరో ప్లేటు స్వీటు, హాటూ పూర్తిచేసి, కప్పు కాఫీ సిప్పు చేసి వెళ్ళిపోయాడు.

* * *

"అమ్మా... ఆ అమ్మాయి నచ్చింది... కానీ..."

"నాకూ నచ్చిందిరా, కానీ..."

"మీ ఇద్దరికీ నచ్చింది కదా, నాకూ నచ్చింది. ఇంతకూ ఇద్దరూ కానీ అంటున్నారేమిటి?"

రాంబాబు తల్లి గొంతు సవరించుకుంది. తండ్రి అటెన్షన్లోకి వచ్చాడు. తనను తొలుస్తున్న ఆలోచనే తల్లిదీనూ అయితే బాగుణ్ణు అనుకుంటున్నాడు రాంబాబు.

"అమ్మాయి నచ్చిందని వెంటనే చెప్పేస్తే 'మనం' అలుసైపోతాం. మిగతా విషయాలు వెంటనే మాట్లాడేస్తే 'మనీ' పలుచనైపోతుంది. అబ్బాయికి ఏమేం అవసరమో ఆలోచించుకోవద్దూ?"

తల్లి తెల్ల కాగితం ఇచ్చింది. దాన్ని తండ్రి అందుకున్నాడు. తల్లి చెప్పడం మొదలుపెట్టింది. కొడుకు జేబులోంచి పెన్ను తీసి రాసుకోవడం మొదలుపెట్టాడు తండ్రి. కలుపుకోవడమే గాని కొట్టివేతలు, తీసివేతలు లేవు. ఆ కాగితం సరిపోలేదు. మరో కాగితం సరిపోలేదు. మరో కాగితం కావాల్సి వచ్చింది. ఆ తతంగం పూర్తయ్యేవరకూ ఆగి ఆఖర్న నోరు మెదిపాడు రాంబాబు.

"అమ్మా కావాల్సినవన్నీ రాసావు. అక్కర్లేనిదేదీ చెప్పలేదు."

"మనం మగపెళ్ళి వాళ్ళం. కావాల్సినవే గానీ అక్కర్లేనివి ఉండవు."

"నాకు అక్కర్లేనిది ఒకటుందమ్మా"

"అక్కర్లేనిదా. ఏమిట్రా అది?"

రాంబాబు చెప్పాడు. తల్లి ఆలోచనలో పడింది.

ఇంతవరకూ తనన్నది కొడుకు కాదనలేదు. తను కాదన్నది కొడుకు అవుననలేదు. ఈ ఒక్కటీ తను అవునంటే ఎప్పటికీ కొడుకు 'తన కొడుకే' అవుతాడు. కొడుకు అన్నదీ తనకు ఒకవిధంగా అనుకూలమైందే.

'సరే.'

కాదంటుందేమో అనుకున్న తల్లి 'సరే' అనేసరికి ఆనందపడిపోయాడు రాంబాబు.

* * *

రాంబాబుది ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షను. మరీ జూనియర్ కావడంతో మరీపెద్ద విషయాలేవీ లేవు. అతని ఆఫీస్ ఆర్డర్లో లీవులు, లోన్లు, డైలీ వేజెస్ వాళ్ళ అటెండెన్సూ తప్ప!

ఓరోజు ఆఫీసుకి వెళ్ళిన రాంబాబు డైలీ వేజెస్ వర్కర్స్ అటెండెన్స్ రిజిష్టరు తీసి చూశాడు. అన్ని సంతకాలూ ఉన్నాయి, ఒక్క 'మణి' సంతకం తప్ప. అప్పుడే అటువైపు నుండి స్టోర్స్‌కి వెళ్తున్న రాజమ్మని పిలిచి అడిగాడు.

"దానికి పెళ్ళండి."

"ఎప్పుడు?"

చెప్పిందామె.

"ఇంక పన్లోకిరాదా?"

"రాదేమోనండి."

రాంబాబు ఇంకేమీ మాట్లాడలేదు.

స్టోర్స్ తియ్యడానికీ, వెయ్యడానికీ, శుభ్రం చేయడానికీ డైలీ రేటెడ్ వర్కర్స్‌ని వేసుకుంటారు రాంబాబు వాళ్ళ ఆఫీసు వాళ్ళు. వాళ్ళ అటెండెన్సు, జీతాలు లెక్కకట్టడం రాంబాబు విధుల్లో ఒకటి. ఎవరైనా మానేస్తే అవసరాన్ని బట్టి ఆ స్థానంలో వేసుకోడానికి ఎవరో ఒకర్ని చూడ్డం కూడా రాంబాబే చేయాలి. స్టోర్స్‌లో చేతికందినవి పట్టుకుపోని నమ్మకమైన వ్యక్తులూ, చెప్పినట్టు చేసే నమ్రత గల వ్యక్తులూ, ఊరి చివర వున్న ఆ ఆఫీసుకి సమయానికొచ్చి వెళ్ళేవాళ్ళూ దొరకడం కొంచెం కష్టమే. ఎవరేం తప్పు చేసినా 'వాళ్ళని కుదిర్చిన వాళ్ళు ఎవరు' అని ఆరా తీసేవాళ్ళూ ఎక్కువే ఆ ఆఫీసులో. అందుకే ఎవరైనా మానేస్తే ఆ ఖాళీల్ని 'భర్తీ చేయడం' తలనొప్పి అవుతుంది రాంబాబుకి.

మణికి పెళ్ళయిపోయింది. మణి వస్తే పర్వాలేదు. లేకపోతే ఆ స్థానంలో మరొకర్ని వేయాలి. అంటే తనే ఎవరినైనా వెదకాలి. మరొకరు దొరికేవరకూ స్టోర్స్ సెక్షన్ వాళ్ళ నుండి సతాయింపు తప్పదు.

తనకీసారి తప్పదేమో ఎవరో ఒకర్ని వెదకడం. మణికి పెళ్ళయిపోతుంది కదా. పన్లోకి ఎలా వస్తుందిక!

ఆ ఆలోచన రావడం వల్లనే, మణి స్థానంలోకి మరొకర్ని వెతకాలి - అన్న విషయం గురించి ఆలోచించక తప్పలేదు రాంబాబుకి.

* * *

కొద్ది రోజులు ఆలస్యంగా, అన్న మాట ప్రకారం రాంబాబు తల్లి మధ్యవర్తి చేత కబురు పెట్టింది - అమ్మాయి నచ్చిందని, మిగతావిషయాలు ఫలానా రోజున మాట్లాడుకుందామని.

కొడుకు చెప్పిన మాట కూడా మధ్యవర్తి ద్వారా కబురు చేద్దామని అనుకుంది గానీ, రాంబాబు ఒప్పుకోలేదు. అన్ని మాటలూ అయ్యాక ఆ అమ్మాయితో తనే మాట్లాడతానన్నాడు. విషయం స్వయంగా చెప్పినట్టూ ఉంటుంది. ఒకర్నొకరు అర్థం చేసుకొనే వీలూ కలుగుతుంది అన్నాడు.

రాబోయే కమీషన్ని బేరీజు వేసుకుంటూ వార్త మోసుకుని మధ్యవర్తి 'రయ్'న వెళ్ళిపోయాడు.

* * *

ఆ ఫలానా రోజు వచ్చింది.

బేరసారాల తతంగం మొదలయ్యింది. రాంబాబు తల్లి, భర్త జేబులో 'లిస్టు' తీసింది. ఒక్కొక్కటీ చదువుతూ (కాబోయే) వియ్యంకుడూ, వియ్యపురాలివైపు చూసింది. లిస్టు చదవటం పూర్తయ్యేసరికి రాధిక తల్లిదండ్రుల ముఖాల్లో చాలా మార్పొచ్చింది. నోట మాట

రాలేదు. ఇంతవరకూ వచ్చిన సంబంధం చేజారిపోతుందేమో నన్న అనుమానంతోనే వాళ్ళు నోరు విప్పలేదు. లిస్టు చదవటం అయిపోయాక కూడా నోరు విప్పింది - ఉన్నవన్నీ తెగనమ్మాలన్న ఆలోచనతోనే!

సంబంధం ఖాయం అయ్యిందని ఇరువైపుల వాళ్ళూ ఆనందపడ్డారు. అయితే ఆడపిల్ల వాళ్ళ ఆనందంలో ఏదో దిగులుంది. అందరికంటే ఎక్కువగా అచ్చమైన ఆనందాన్ని పొందింది మధ్యవర్తి!

అన్నీ అయ్యాక రాంబాబు, తల్లి చేతిని గోకాడు ఎవరూ చూడకుండా. తల్లి నవ్వుతూ వియ్యపురాలితో అంది.

"అబ్బాయి అమ్మాయితో మాట్లాడతాడట. కాస్త ఏకాంతం ఏర్పాటుచేయండి వాళ్ళకి. రోజులు మారిపోయాయి కదా వదిన గారూ. మన రోజులా ఎదిగిపోయారిప్పటి పిల్లలు."

సరదాలు బేరాలుగా, పద్ధతులు బెదిరింపులుగా, లాంఛనాలు హక్కులుగా ఎదిగిపోయినట్లే కన్పించాయి గానీ, తన కూతురితో వాళ్ళబ్బాయి మాట్లాడాలనుకోవడం ఎదిగిపోయినట్లుగా ఏమాత్రం అన్పించకపోయినా - రాధిక తల్లిదండ్రులు అలాగే ఏర్పాటుచేశారు.

రాధిక ఉన్న ఆ గదిలోకి టక్ సర్దుకొని, గొంతు సవరించుకొని వెళ్ళాడు రాంబాబు.

* * *

ఆ రోజు డైలీ వేజెస్ వర్కర్స్ అటెండెన్స్ రిజిష్టరు చూసిన రాంబాబు కళ్ళు పెద్దవయ్యాయి.

ఎందుకంటే అందులో 'మణి' సంతకం వుంది.

ఆ తర్వాత మంచినీళ్ళకని అటువైపు వచ్చిన రాజమ్మని పిలిచి అడిగాడు.

'మణి పన్లోకి వచ్చేసిందా?"

'వచ్చిందండి...'

'పెళ్ళయి వారం రోజులే కదా అవుతోంది?"


"అవునండీ. మేమూ అదే అడిగామండి. మణి పైకి మెత్తగా కన్పిస్తాది అండీ, పెళ్ళికి ముందే మొగుడ్ని అడిగిందటండీ..."

"ఏ విషయం గురించి?"

"దాని పని, సంపాదన గురించండీ... ప్రతిదానికీ మగవాడి మీద ఆధారపడ్డం ఇష్టం లేదు. ఏదో నాకు దొరికిన పని నేను చేసుకుంటాను. ఎంతో కొంత సంపాదిస్తాను. నీ సంపాదన మించిన ఖర్చొస్తే మనింట్లో ఖర్చు పెడతాను. మా అమ్మా నాన్నలకి అవసరమొస్తే వాళ్ళకి ఖర్చు పెడతాను. చిన్నప్పటి నుండీ పెంచి పెద్ద చేసినోళ్ళని ఆదుకొనే బాధ్యత ఆడపిల్లనైనా నాకూ ఉంది కదా. అందుచేత నన్ను పని మానొద్దంటేనే పెళ్ళి చేసుకుందాం. లేకపోతే లేదు... అని అందంటండీ!

"దాని మొగుడు మెకానిక్ షెడ్లో చేస్తాడటండి. సంపాదన బాగానే ఉంటాదటండి. ముందైతే మణిని పని మానెయ్యమందామనుకున్నాడంట. కానీ దాని మాటలకు కాదనలేకపోయాడంట. ఆడదానికీ డబ్బుల విషయంలో సొతంత్రం ఉండాలనుకున్నాడు. అందుకే పని చెయ్యడానికి ఒప్పుకున్నాడు. అంతే కాదండీ. దాని అందంతో పాటూ బుద్ధిని చూసి పిల్ల ముఖ్యం అనుకున్నాడంట. కానీ కట్నం గానీ, ఏ చిన్న కోరికగానీ కోరలేదంటండీ..."

రాజమ్మ అలా చెపూనే వుంది గానీ అవేమీ రాంబాబుకి విన్పించలేదు. చెప్పడం అయిపోయిన తర్వాత



రాజమ్మ అక్కడినుండి వెళ్ళిపోవడం కూడా గమనించలేదు. ఏవో ఆలోచనల్లో పడిపోయాడు చాలాసేపు.

ఆలోచనల్లోంచి తేరుకున్నాక గంట పర్మిషన్ పెట్టాడు. తర్వాత రాంబాబు హడావుడిగా వెళ్ళింది ఇంటికి కాదు!

రాధిక 'జాబ్' చేసే ఆఫీసుకి!

రాంబాబుని చూసి ఆశ్చర్యపోయింది రాధిక. ఇద్దరూ క్యాంటీన్‌కి వెళ్ళారు. రెండు కాఫీ చెప్పి తనే ముందు మాట్లాడాడు. ఆఫీస్ అవర్స్ కావడం వల్ల క్యాంటీన్లో జనం అంతగా లేరు.

"మీరు రిజిగ్నేషన్ సబ్‌మిట్ చేసారా?"

అంతలో కాఫీలొచ్చాయి. ఒక కప్పు రాధికకు అందించి రెండోది తను తీసుకున్నాడు. కాఫీ ఒకసారి సిప్ చేసి చెప్పింది రాధిక.

"లేదు. ఈ నెలాఖరున చేద్దామని ఆగాను."

"వద్దు. రిజైన్ చేయకండి."

ఆ మాట రాధిక ఊహించింది కాదు. అందుకే ఆశ్చర్యంగా చూసింది రాంబాబు వైపు. తేరుకొని "ఆ రోజు మా ఇంట్లో మీరే కదా రిజైన్ చేయమన్నారు?" అనడిగింది.

ఖాళీ కప్పుని టేబుల్ మీద పెడుతూ రాధికవైపు చూసాడు రాంబాబు.

"రిజైన్ చేయడానికి ఇష్టపడితేనే మన పెళ్ళి జరుగుతుందని కూడా చెప్పారు?"

"అవును. అప్పుడూ చెప్పేను. ఇప్పుడూ నేనే చెప్తున్నాను. మీరు రిజైన్ చేయకండి."

రాధిక ఏం మాట్లాడలేదు. కానీ మనసులో అనుకుంది... "చెయ్యమనడం, మానెయ్యమనడం అన్నీ ఇతని ఇష్టమేనా. ఈరోజు జాబ్ చేయమంటున్న ఇతనే రేపొచ్చి రిజైన్ చేయమంటాడేమో..."

ఆమె ఆలోచనలు అర్థమయ్యాయో ఏమో గానీ "మీరు అనుమానపడక్కర్లేదు. మళ్ళీ నా అభిప్రాయం మార్చుకోను" అన్నాడు.

రాధిక రాంబాబు కళ్ళల్లోకి చూసింది. రాంబాబు మాట్లాడుతున్నాడు.

"... అంతే కాదు. మొన్న మీ ఇంట్లో మా అమ్మ చదివిన 'లిస్టు' మరచిపోండి. ఏమీ వద్దు నాకు. కట్నం వద్దు, కానుకలూ వద్దు. లాంఛనాల పేరిట మీవాళ్ళు చితికిపోవద్దు!"

వచ్చిన పని అయిపోయినట్టు లేచి నిలబడ్డాడు రాంబాబు.

"మరి... మీ ఇంట్లో వాళ్ళు..." అర్థోక్తిగా అని ఆగిపోయింది రాధిక.

"అవన్నీ నేను చూసుకుంటాను. ఒప్పిస్తానో, ఎదిరిస్తానో మన పెళ్ళి తప్పకుండా జరుగుతుంది, మీ వాళ్ళకు ఏమాత్రం భారం కాకుండానే. మీరు ఉద్యోగం కూడా చేస్తారు. చెయ్యాలి కూడా!"

రాంబాబుని అభినందిస్తూ సంతోషంగా కరచాలనం చేయాలనుకున్న రాధిక, స్త్రీ సహజమైన సిగ్గో, బిడియమో, మరేదో అడ్డొచ్చి ఆగిపోయింది గానీ... 'మరి నే వెళ్తొస్తాను' అని చెప్పిన రాంబాబుతో 'మంచిది. ఈలోగా మళ్ళీ వస్తారు కదూ?' అని 'స్వరచాలనం' మాత్రం చేయగలిగింది.

వెళ్ళిపోయేవాడల్లా ఆగి చిన్నగా నవ్వాడు రాంబాబు!

❑